



ఖమ్మం మార్కెట్‌కు

పోటెత్తిన తెల్ల బంగారం

ఈ సీజన్‌లో తొలిసారి 25 వేల బస్తాల రాక

9



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం 16 అక్టోబరు 2025

‘ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇకపై ఇంకో లెక్క’ అన్నట్టుగా మారింది కాంగ్రెస్ రాజకీయం. గతానికి భిన్నంగా ఈ సారి పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకాల నిబంధనలను అధిష్ఠానం మార్చింది. ఓ వైపు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుండగా.. మరోవైపు ఏఐసీసీ నుంచి వచ్చిన కొత్త నిబంధనలు ఆశావహులకు అవరోధంగా మారాయి. ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్నవారికి ఈ సారి అవకాశం లేదని, కొత్తవారికి.. అది కూడా కార్యకర్తలు మెచ్చినవారికే పట్టం కట్టబోతున్నామని, కనీసం ఐదేళ్లపాటు పార్టీలో పనిచేసిన వారికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలిచ్చారు. దాంతో ఈసారి ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులుగా కొత్త నేతలు ఎంపికకాబోతున్నారు. ఇదిలా ఉంటే ప్రజాప్రతినిధుల బంధువులకు కూడా డీసీసీ పీఠం ఇవ్వొద్దని సూచించడంతో.. పార్టీలో గతంనుంచి ఉండి.. ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి ఆశలు గల్లంతయ్యాయి.



శ్రేణులు మెచ్చిన నేతకే పగ్గాలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకాల్లో మారిన నిబంధనలు
- పాతవారికి నో ఛాన్స్ అని తేల్చిన అధిష్ఠానం
- ఆశావహులకు ఆటంకాలెన్నో
- అవకాశం కోల్పోబోతున్న దుర్గాప్రసాద్, వీరయ్య

ఖమ్మం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఎంపిక విషయంపై కసరత్తు ప్రారంభించిన ఏఐసీసీ పరిశీలకులు ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెంజిల్లాల్లోని ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవడంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బ్లాక్‌లవారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలోలా సిఫార్సులను పక్కనబెట్టి కార్యకర్తల అభిప్రాయం మేరకు కొత్త నేతను ఎంపిక చేయబోతున్నారు. ఖమ్మంజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలుగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కొనసాగుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా పొదెం వీరయ్య ఉన్నారు. అయితే ఈసారి కూడా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య ఇద్దరూ ఉన్నారు. వారితో పాటు ఖమ్మంజిల్లానుంచి సుమారు 30కిపైగా, భద్రాద్రికొత్తగూడెంలో జిల్లాలో కూడా ఆశావహులు భారీగానే ఉన్నారు. వారంతా పార్టీ ఇన్‌చార్జ్‌లకు దరఖాస్తులు అందిస్తున్నారు. ఖమ్మంజిల్లాకు తమిళనాడుకు చెందిన మహేంద్రన్ ఇన్‌చార్జ్‌గా ఉండగా, భద్రాద్రి జిల్లాకు జాన్సన్ అబ్రహం నియమితులయ్యారు. వీరి ఆధ్వర్యంలో డీసీసీ ఎన్నికలకు కసరత్తు జరుగుతోంది. ఇరు జిల్లాల ప్రస్తుత అధ్యక్షులు ఇద్దరికీ తాజా నిబంధనలతో మళ్లీ ఎన్నికయ్యే అవకాశం లేదు. ఒకవేళ ఏఐసీసీ నుంచి ప్రత్యేక అనుమతి పొందితే తప్పా వీరికి అవకాశం వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో ఇప్పుడు డీసీసీ పదవికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన వారికి కూడా అవకాశం దక్కే అవకాశాలున్నాయి.

అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు..

కార్పొరేషన్లు, ఇతర నియామక పదవుల విషయంలో మొదటినుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారికి అన్యాయం జరిగిందని, గతంలో జిల్లాల పరిశీలకులుగా వచ్చిన ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పలువురు జిల్లా నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఇదే పరిస్థితి ఇతర జిల్లాల్లో ఉండడంతో ఏఐసీసీనుంచి మీనాక్షి నటరాజన్ కొత్త నిబంధనలు విధించారు. ఈ నిబంధనలతో పార్టీలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. ప్రజాప్రతినిధులకు బంధువులు కానివారు, ప్రస్తుత జిల్లా అధ్యక్షులకు అవకాశం ఉండదని తేల్చిచెప్పడంతో ఇటు ఖమ్మం.. అటు భద్రాద్రి కొత్తగూడెం అధ్యక్ష పీఠాలు ఎవరికి దక్కుతాయన్న దానిపై (మిగతా 8వ పేజీలో)



మహేంద్రన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు

కార్యకర్తల నుంచి ఎన్నుకోవడం ఇదే మొదటిసారి

సత్తుపల్లిలో ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్

సత్తుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయించేదని, కానీ ప్రస్తుతం రాహుల్‌గాంధీ సూచన మేరకు కార్యకర్తలకు ఇష్టమైన వ్యక్తినే ఎంచుకునే అవకాశం కల్పించామని ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని ఎమ్మార్ గార్డెన్స్‌లో డీసీసీ పదవి ఆశిస్తున్న నియోజకవర్గంలోని నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొత్త ఉత్సాహం, కొత్త ఊపిరిని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా కార్యకర్తలంతా పనిచేయాలని, అండదండబలం వారేనని, వారి భుజస్కంధాలపై మోసి రాష్ట్రంలో తీసుకొచ్చారని, వారి లేనిది పార్టీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తుమ్మల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

- అందుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలి
- 72గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేయండి
- ధాన్యం కొనుగోళ్లపై వీసీలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్

9

మళ్లీ ఆ నలుగురే!

- బాణసంచా దుకాణాల్లో సిండికేట్ దందా షురూ
- బినామీ పేర్లతో షాపులు దక్కించుకున్న వైనం
- ఏటా రూ.లక్షలు బొక్కేస్తున్నా.. పట్టించుకోని అధికారులు
- రెండు శాఖలకు ముందుగానే ముట్టిన నగదు?
- ఈ సారి దరఖాస్తులు 148.. డ్రాలో షాపులు ఇచ్చినవి 128



బాణసంచా దుకాణాలకు డ్రా తీస్తున్న పోలీసులు

ఖమ్మం క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి వచ్చిందంటే చాలు నగరంలోని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల్లో ఆ నలుగురిదే సిండికేట్ దందా. సంబంధం లేని వారి పేరుమీద షాపులకు దరఖాస్తులు చేసుకోవడం.. తర్వాత సాధారణ దరఖాస్తుదారుల ఫోన్ నెంబర్లు తీసుకోవడం.. దుకాణాలు ఏర్పాటు చేయాలంటే అధికారులకు ముడుపులు చెల్లించాల్సిందే అంటూ వసూళ్ల పర్వం సాగించడం వారి పని. ఏటా వారు చేసే ఈ దందా గురించి అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోరు. దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలంటూ దసరా పండుగ తరువాత పోలీస్ అధికారులు ఓ ప్రకటన ఇచ్చారు. అప్పటి నుంచి ఆ నలుగురు వ్యక్తులు తమకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవడం ప్రారంభించారు. టపాసుల షాపుల ఏర్పాటుకు ఒక అసోసియేషన్ అంటూ ఏమి లేదు కానీ కొందరు కలిసి సిండికేట్‌గా ఏర్పడి దందా చేస్తున్నారు. ముఖ్యంగా ఆ నలుగురు చేసే దందాకు అధికారులు వంతపాడతారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బినామీ పేర్లతో షాపులు

కొందరు వ్యాపారులు బినామీ పేర్లతో టపాసుల షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు చేశారు. వీరిలో మొత్తం 148 మంది దరఖాస్తు చేయగా వారిలో 128మందికి మాత్రమే షాపులు కేటాయించారు. 20షాపుల్లో కొందరు రెండుషాపులు దరఖాస్తు చేసిన వారిని తిరస్కరించగా.. మరికొంతమందికి డ్రాలో షాపులు దక్కలేదు. అదేవిధంగా వీటిలో ఒకే ఇంటిపేరుతో ఉండి రెండు లేక మూడు దరఖాస్తులు చేసిన వారిని పోలీసుశాఖ అధికారులు తిరస్కరించినట్టు అధికారులు తెలిపారు. అయినప్పటికి వేర్వేరు ఇంటిపేర్లతో దరఖాస్తులు చేశారని తెలుస్తోంది. పోలీసు అధికారులుకు ఏ మాత్రం అనుమానం రాకుండా ముందుగా దరఖాస్తు చేసుకుని ఏమీ (మిగతా 10వ పేజీలో)

గ్లోబల్ సంస్థగా సింగరేణి

- సత్తుపల్లిలో మినరల్స్ కోసం పరిశోధన
- 1.56కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు



మీడియాతో మాట్లాడుతున్న జీఎం షాలేం రాజు

సత్తుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ గ్లోబల్ సంస్థగా ఆవిర్భవించబోతోందని, ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా పదెకరాల స్థలాన్ని గ్లోబల్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీయటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, అంతర్జాతీయ స్థాయిలో కూడా పలు క్రిటికల్ మినరల్స్ వెలికితీసేందుకు కూడా కృషి చేస్తోందన్నారు. బంగారు గనుల అన్వేషణలో కూడా ఇతర రాష్ట్రాలతో ఒప్పందం చేసుకుందన్నారు. సింగరేణి సంస్థ 700 మిలియన్ యూనిట్స్ విద్యుత్ వినియోగిస్తోందని సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయటం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగించుకునే క్రమంలో కొత్తగూడెం ఏరియా పరిధిలో 102మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఇందులో కొన్నింటిని ఇన్‌స్టాల్ చేసినట్టు చెప్పారు. ఖమ్మం జిల్లాలో డీఎండీఎఫ్ నిధులు ఇప్పటి వరకూ రూ.247కోట్లు జమ చేశామని, సత్తుపల్లి మండలంలో ఓపెన్ కాస్టు బొగ్గు గని నుంచి తీసిన ఓవర్‌బర్డెన్ నుంచి క్రిటికల్ మినరల్స్ కోసం పరిశోధన (మిగతా 8వ పేజీలో)

నిద్రచేసేందుకు పుట్టింటికి వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు చిన్నారుల మృతి
- కామారెడ్డి జిల్లా భిక్కనూరులో ఘటన
- రాంగ్‌రూట్‌లో వచ్చి స్కూటీని ఢీకొట్టిన టిప్పర్
- చిన్నారికి టీకా వేయించేందుకు వెళుతుండగా ప్రమాదం
- స్వగ్రామం ముష్టికుంట్లలో విషాద ఛాయలు



మృతిచెందిన తల్లి జాశ్విన్, చిన్న కుమారుడు జాట్సన్, పెద్ద కుమారుడు జోయల్ (ఫైల్)

బోనకల్/ భిక్కనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల పసికందుతో నిద్ర చేసేందుకు పుట్టింటికి వెళ్లిన ఆ తల్లితో పాటు ఆమె ఇద్దరు కుమారులు, ఆమె తండ్రిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఇక పిల్లలను తీసుకుని అత్తారింటికి వెళ్లిన తన భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసి బోనకల్ మండలం ముష్టికుంట్లలోని భర్తకు తీరని శోకమే మిగిలింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దల జగన్(భరత్‌కుమార్)కు ఆదిలాబాద్‌కు చెందిన బాల్‌కిషన్(53) కుమార్తె జాశ్విన్(25)తో 2020లో వివాహమైంది. వీరికి జోయల్(4), జాట్సన్(4 నెలలు) ఇద్దరు కుమారులున్నారు. జాట్సన్ జన్మించిన క్రమంలో పుట్టింట్లో నిద్ర చేసేందుకుగాను జాశ్విన్ తన ఇద్దరు కుమారులను తీసుకుని ఈ నెల 7న ఆమె తండ్రి బాల్‌కిషన్ ప్రస్తుతం పాస్టర్‌గా ఉంటూ నివాసం ఉంటున్న కామారెడ్డికి వెళ్లింది. ఈ క్రమంలో చిన్న కుమారుడికి టీకా వేయించేందుకు బుధవారం భిక్కనూరు మండలం జంగంపల్లిలో తమ బంధువు అయిన ఆశా వర్కర్ వద్దకు తండ్రి కిషన్ స్కూటీపై ఇద్దరు పిల్లలతో కలిసి జాశ్విన్ బయలు దేరింది. ఈ క్రమంలో జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీ కొట్టడంతో కిషన్, ఆయన కుమార్తె జాశ్విన్, మనవడు జోయల్ అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన నాలుగు నెలల జాట్సన్‌ను ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జాశ్విన్, ఇద్దరు కుమారుల మృతితో ముష్టికుంట్లలోని వారి నివాసంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే బాల్‌కిషన్ భార్య కొన్నేళ్ల క్రితం మరణించగా.. అప్పటినుంచి ఆయన కామారెడ్డిలోని షాబ్దిపూర్ రోడ్డులో తన తల్లిదండ్రులతో అద్దెకు ఉంటున్నాడు. ఈ ప్రమాదం విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కామారెడ్డి రూరల్ సీఐ రామన్ పరిశీలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ రాజిరెడ్డిని పోలీసులు ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు.



100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ విద్యుత్ అవసరాల కోసం సింగరేణిసంస్థ నుంచి 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు తెలిపారు. సింగరేణి బొగ్గు రంగాలతో పాటు ఇతర రంగాల్లో విస్తరిస్తోందని ప్రకటించారు. బుధవారం కొత్తగూడెంలోని ఇల్లెందు క్లబ్‌లో సింగరేణి ఉన్నతాధికారులు, విశ్రాంత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి, సౌర విద్యుత్ ఉత్పత్తి, థర్మల్ విద్యుత్ తదితర రంగాల్లో సింగరేణి రంగప్రవేశం చేసిందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాకుండా ఇతర రంగాల్లో అడుగు పెట్టాల్సిన (మిగతా 8వ పేజీలో)

జాతీయస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్ల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయం

పినపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబరు 7,8,9 తేదీల్లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి, జనవరిలో నిర్వహించబోయే అండర్ -17 జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాపోటీల ఏర్పాట్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. క్రీడా పోటీలను వీక్షించేందుకు జనవరిలో ముఖ్య అతిధులుగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ముఖ్య అతిథులుగా పలువురు మంత్రులు రాక నేపథ్యంలో చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తో ప్రత్యేక సమావేశానంతరం పూర్తి వివరాలు, విధివిధానాలు రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వీరన్న, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గ్రామపెద్దలు గంగిరెడ్డి వెంకటరెడ్డి, వి లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు తోట గంగాధర్, శ్రీరాం బృహస్పతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆదివాసీ విద్యార్థి ఎంపిక



సాత్విక్

జూలూరుపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థి గడిగే సాత్విక్ ఎంపికయ్యారు. సాత్విక్ గుండెపుడి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలో అండర్-17 విభాగంలో వాలీబాల్ పోటీలో ఆయన పాల్గొని ప్రతిభ నకబరచాడు. దీంతో ఆయనను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సంగారెడ్డిలో గురు, శుక్ర వారాలలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరుపున సదరు విద్యార్థి పాల్గొనున్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి సాత్విక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగవేణి, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ మహిళా జట్టుకు ...



సృజన

బూర్గంపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బూర్గంపాడుకు చెందిన మేక సృజన ఫుట్‌బాల్ రాష్ట్ర మహిళ జట్టుకు ఎంపికైంది. బూర్గంపాడు ఎస్సీ కాలనీకి చెందిన పున్నం-పద్మ దంపతుల కుమార్తె సృజన గురువుల ప్రోత్సాహంతో చదువుతో పాటు క్రీడల్లో తన ప్రతిభ చాటడంతో ఆమెను స్పోర్ట్స్ పాఠశాల పోటీ పరీక్షకు ఎంపిక చేయడంతో మెదక్ జిల్లా స్పోర్ట్స్ అకాడమీలో ఏడవ తరగతిలో సీటు దక్కించుకుంది. ఈ క్రమంలో ఫుట్‌బాల్ క్రీడల్లో భాగం గా తన గురువు ప్రకాష్ తోడ్పాటుకు అందించడంతో రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ జట్టులో స్థానం సంపాదించగలిగనాని సృజన తెలిపింది. తన లక్ష్యం భారతీయ ఫుట్‌బాల్ మహిళా జట్టులో చోటు దక్కించుకుని తన ప్రతిభను చాటాలని ఆమె పేర్కొంది. సృజన తెలంగాణ రాష్ట్ర మహిళా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక కావడంతో ఎంతో సంతోషంగా ఉందని ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆమెను సన్మానించి క్రీడల్లో మరింతగా రాణించాలని అకాంక్షించారు. రమణారెడ్డి, నరసింహరావు, రవి, సర్వేశరరావు, శ్రీను, సాంబశివరావు, రవి, వెంకటేశ్వర్లు, రమణ, శ్రీను, సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

» ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నూతన రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయాలని, ప్రస్తుతం చేపట్టిన రోడ్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో రోడ్ల నిర్వహణపై రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల వర్షాలకు రహదారులు చాలా చోట్ల దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న రోడ్ల గుంతలు, చిన్న చిన్న మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా జిల్లాకు సంబంధించి నేమ్ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీనివాసాచారి, నేషనల్ హైవే పీడీ రామాంజనేయ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ పవార్, తానేశ్వర్, నేషనల్ హైవే ఈఈ యుగంధర్, డీఈ లు, ఏఈ లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

‘ఆపరేషన్ సిందూర్’ కెప్టెన్‌కు సన్మానం



కిషోర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఖమ్మం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లగూడెనికి చెందిన మడకంటి కిషోర్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్ పాల్గొన్న అనంతరం తొలిసారిగా గ్రామానికి బుధవారం రాగా గ్రామస్థులు, బీజేపీ నాయకులు కిషోర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. వాయుసేనలో కెప్టెన్‌గా పనిచేసిన జిల్లా వాసి సుదీర్ఘకాలంగా వాయుసేనలో పని చేస్తూ ఉన్నత పదవులు అధిరోహించినావల్ ఎయిర్ ఆర్మ్ కమిషన్ ఆఫీసర్‌గా ఎదగడం జిల్లాకు గర్వకారణమని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. విశిష్ట సేవా పురస్కారానికి నామినేట్ అయి2007 నుంచి వాయుసేనలో కొనసాగుతూ ఉత్తమ సుప్రీం కమాండర్‌గా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం మీదుగా అవార్డు అందుకోవడం సంతోషదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీను, బీజేపీ నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఆంధ్రజ్యోతి’ వార్షికోత్సవం



మాట్లాడుతున్న బీఎం పుల్లారావు

ఖమ్మం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ‘ఆంధ్రజ్యోతి’ దినపత్రిక 23వ వార్షికోత్సవాన్ని బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ పుల్లారావు కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతి కాలంలో లక్షలాది మంది పాఠకుల అభిమానం చూరగొని, దమ్మున్న పత్రికగా ఆంధ్రజ్యోతి ప్రజల హృదయాల్లో నిలిచిందన్నారు.

ఈ కార్యక్రమంలో ‘ఆంధ్రజ్యోతి’ బ్యూరో ఇన్‌చార్జ్ ఎస్.వెంకటరావు, ఎడిషన్ ఇంచార్జ్ కె.రాజేష్, యాడ్స్ మేనేజర్ ఎం.రమేష్, సబ్‌ఎడిటర్లు, జర్నలిస్టులు, వివిధ విభాగాలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసిన 25 ప్రభుత్వ పాఠశాలలో ని బాలికల ఆత్మరక్షణ విద్య(కరాటే) శిక్ష ణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాలపరిమితి కలిగిన శిక్షణా కాలానికి నెలకు రూ.10 వేలు పారితోషకం ఇస్తామని తెలిపారు. బ్లాక్‌బెల్ట్ వారు అర్హులని, మహిళలకు తొలి ప్రాధాన్యమని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 18 కల్లా అన్ని ధృవ పత్రాలతో స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

» సీపీఐ ఎంఎల్‌మాస్‌లైన్ కేంద్రకమిటీ సహాయ కార్యదర్శి పోటు



మాట్లాడుతున్న పోటు రంగారావు

తిరుమలాయపాలెం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు వెంటనే జరపాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్రకమిటీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణస్మారక భవనంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు ఎంఎల్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 90గ్రామపంచాయతీలో 50 ఎంపీటీసీలో, 25 జడ్పీటీసీలలో పోటీచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈసమావేశంలో కమ్మకోమటి నాగేశ్వరావు, తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఆరెంపుల వెంకన్న, మీగడ సత్యం, యడ్లపల్లి నవీన్, మధు, రాయిండ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

ఖమ్మంక్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోతసవం సందర్భంగా ఖమ్మం పోలీసుకమిషనరేట్ పరిధిలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖాధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు పోలీసుకమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈనె 21నుండి 31వరకు వారోత్సవాలు నిర్వమించబడతాయని, తెలిపారు. ఇటీవల కాలంలో తీసిన మూడు ఫోటోలు, తక్కువ నిడివిగల షార్ట్ ఫిల్మ్ తీసి రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 22వతేదీలోపు పోలీసుకమిసనరేట్ కార్యాలయంలో అందించాలని కోరారు. ఈపోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు అత్యవసర సమయాల్లో పోలీసులస్పందనప్రకతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గతేదాది 2024 అక్టోబరు నుండి ప్రస్తుతం ఏడాది అక్టోబరునెల వరకు తీసిని మూడు ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్‌లు మాత్రమే పంపిచాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8712659256 నెంబర్‌లో సంపందించాలన్నారు.

భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం

భద్రాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి బుధవారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజునస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామి వారికినిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం , పట్టాభిషేక ఘట్టం ప్రవచనాన్ని దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు చేసారు. తరువాత కిరీటధారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసా ద నివేదన చేసి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో సీతారామచంద్రస్వామి వారికి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ముఖ్య అర్చకులు శ్రీ పెరంబదూర్ మదన్‌మోహనాచార్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

(7వ పేజీ తరువాయి)

అవశ్యకతపై చర్చించారు. తెలంగాణతో పాటు దేశ అవసరాలకు భవిష్యత్‌లో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు తీసుకోవల్సిన ప్రణాళికలపై చర్చించారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సింగరేణి సంస్థ భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై అధికారులకు వివరించారు. సింగరేణిలో ఎంతో అనుభవం ఉన్న విశ్రాంత డైరెక్టర్లు సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు డైరెక్టర్ ఈఅండ్ఎం మోకాళ్ల తిరుమలరావు, అడ్వైజర్ మినిస్ట్రీ ఆఫ్ కోల్ వీరారెడ్డి, విశ్రాంత డైరెక్టర్లు డీఎల్ఆర్ ప్రసాద్, బిక్కి రమేష్ కుమార్, ఎ మనోహర్‌రావు, భాస్కర్‌రావు, బాలకోటిరెడ్డి, విశ్రాంత జీఎంలు సీకే రెడ్డి, గురువయ్య, సీతారామయ్యతో పాటు సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్లు రవి బొజ్జ, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రేణులు మెచ్చిన నేతకే పగ్గాలు..

(7వ పేజీ తరువాయి)

అంతర్గత చర్చ నడుస్తోంది. ఈనెల 18వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంది.

పదవులపై చర్చ..

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రెండు డీసీసీల్లో ఒకటి జనరల్‌కు, మరొకటి బీసీ నేతకు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 5 ఎమ్మెల్యేలుండగా నలుగురు ఎస్టీలున్నారు. కొత్తగూడెం నుంచి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో డీసీసీ పదవి జనరల్ లేదా బీసీకి దక్కే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి ఉన్నారు. వారిలో ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉండడంతో పాటు రాజ్యసభ సభ్యురాలిగా రేణుకాచౌదరి, లోక్‌సభ సభ్యుడుగా రామసహాయం రఘురాంరెడ్డి ఉన్నారు. వీరి అభిప్రాయం కీలకం కానుంది. జిల్లాలో 5 నియోజకవర్గాల నుంచి డీసీసీ పదవులకోసం ఇప్పటికే దరఖాస్తు చేసిన వారుండగా, వారిలో ఎవరికి దక్కుతుందన్నది ఉత్కంఠగా మారింది.

మోదీ ఫాసిస్టు పాలనపై కాంగ్రెస్ సమరం

ఏఐసీసీ కార్యదర్శి జాన్సన్ అబ్రహం



ప్రసంగిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి జాన్సన్ అబ్రహం

ఇల్లెందు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) మోదీ సర్కార్ సాగిస్తున్న ఫాసిస్టు పాలనపై కాంగ్రెస్ రాజీలేని పోరాటం చేస్తుందని, సెక్యూలర్ దేశాన్ని కాపాడుకునేందు కు రాహులు గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేదం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి జిల్లా, డీసీసీ అధ్యక్ష ఎన్నిక పరిశీలకులు జాన్సన్ అబ్రహం పిలుపు నిచ్చారు. బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపికపై ఏఐసీసీ పరిశీలకులు కాంగ్రెస్ నాయకులు భిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో జాన్సన్ అబ్రహం మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలనతో సెక్యూలరిజానికి తీవ్ర ముప్పు ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని సెక్యూలరిజాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత జోడోయా త్ర, ఓటర్ అధికార్ యాత్రలు నిర్వహించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. డీసీసీ ఎంపికలో నాయకుల పనితీరు, కమిట్‌మెంట్, క్యాడర్ మనో భావాలు, పరిగణంలోకి తీసుకుంటామన్నారు. అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ త్యాగాల పార్టీ అన్నారు. క్రమ శిక్షణతో పనిచేసిన వారికే అవకాశాలు లభిస్తాయని పెర్కోన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, టీపీసీసీ నాయకులు సుబ్బారావు, సాగరిక, నాగసీతారాములు, దర్మారావు, ఎస్‌టీ ఎస్ అధ్యక్షుడు రవి, దుర్గాప్రసాద్, కోటేశ్వరావు, దమ్మాలపాటి వెంకటేశ్వరావు, పులిసైదులు, డానియల్, దళ్‌సింగ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సంస్థగా సింగరేణి

(7వ పేజీ తరువాయి)

సాగుతోందన్నారు. భువనేశ్వర్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్ టెక్నాలజీ.. హైదరాబాద్‌కు చెందిన నాన్ సర్వెస్ మినరల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌లతో కలసి ఈ ప్రాంతంలో మినరల్స్ ఉన్నాయనే విషయంశోధిస్తున్నట్టు వివరించారు. ప్రాసోడియం, నియోడయోమియం, స్ట్రాన్షియం, స్కానియం లాంటి మినరల్స్ ఉన్నట్లు సమాచారం ఉందని, వీటిపై నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ వాణిజ్యపరంగా ఎలాంటి నిర్ధారణ కాలేదని, పరిశోధన స్థాయిలోనే ఉందన్నారు.

1.56కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

కొత్తగూడెం ఏరియా పరిధిలోని బొగ్గు గనుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో 1.56కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకూ 75.71లక్షల బొగ్గు ఉత్పత్తి జరిగిందని రానున్న నెలల్లో లక్ష్యం సాధించనున్నట్లు తెలిపారు. 84లక్షల బొగ్గు రవాణా ఉత్పత్తి చేశామని, 869లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ లక్ష్యం కాగా 391లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించినట్లు వివరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సత్తుపల్లి ప్రాంతంలో రూ.36కోట్లు కేటాయించగా రూ.22కోట్లు ఖర్చు చేశామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి సూచనతో సత్తుపల్లిలో ఈ నెలాఖరు లోపు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, 2వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉందన్నారు. సత్తుపల్లిలోని సైలో, స్టోరేజ్ బంకర్‌లలో పగుళ్లు రావటం వల్ల 8వేల టన్నులు రైల్ మార్గంలో కాకుండా రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేయటంపై ఆయన మాట్లాడుతూ పగుళ్లిచ్చిన బంకర్లకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని, దానికి గాను రూ.5కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి డిజైన్ సిద్ధం చేస్తున్నామన్నారు. పగుళ్ల వల్ల సంస్థకు వచ్చిన నష్టంపై ప్రశ్నించగా సైలో బంకర్ నిర్మించిన కాంట్రాక్టు సంస్థపై కోర్టులో కేసు వేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కిష్టారం పీవో నరసింహారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి ఇలాఖాలో ఆకలిపోరాటం

గిరిజన కార్మికుల సమస్యలు పట్టని సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యేలు

72 గంటల ధర్నాతో దిగిరాకపోతే ప్రజా ప్రతినిధులను ఊళ్లోకి రానివ్వం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

గాడిదకు వినతి పత్రంతో వినూత్న నిరసన



ప్రభుత్వ తీరును నిరసిస్తూ గాడిదకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇలాఖాలోని గిరిజన కార్మికులు ఆకలి పోరాటం 34 రోజులుగా సాగుతుండగా 72 గంటల నిరంతర నిరసన నిర్వహించినా సమస్యపై దృష్టి సారించకపోవటం బాధాకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. భద్రాచలంలో 72 గంటల పాటు ఐటీడీఏ ఎదుట నిరంతరం నిరసన నిర్వహించగా ఈ ధర్నా బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ పాత జీతాలు, వసతి గృహాలు దినసరి కార్మికులకు వెంటనే చెల్లించాలని లేదంటే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గిరిజన కార్మికుల సమస్యలు ఏ మాత్రం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యేలకు పట్టటం లేదని విమర్శించారు. ఈ 72 గంటల మహా నిరసనతో ప్రభుత్వ పెద్దలు దిగిరాకపోతే కలిసి వచ్చే అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేయటమే కాదు నిర్లక్ష్యం చేస్తున్న ప్రజా ప్రతినిధులను ఊళ్లో కూడా తిరగకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కాగా బుధవారం సైతం కార్మిక పోరాటానికి ప్రజా సంఘాల నుంచి విస్తృత మద్దతు లభించింది. 72 గంటల పాటు జరిగిన నిరసన సమయంలో వసతి గృహాల దినసరి కార్మికులు అక్కడే తమ నిరసనను వ్యక్తం చేశారు. అలాగే వంటా వార్పుతో పాటు అక్కడే నిద్రించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో గాడిదకు తమ వినతి పత్రాన్ని అందజేసి వినూత్న రూపంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొలగాని బ్రహ్మచారి, నాగేశ్వరరావు, గిరి, ఈశ్వర్, మంగీలాల్, జలంధర్, నరసింహారావు, మోహన్, పండా మంగమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ అరుణ

ఖమ్మం రూరల్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పశువులన్నింటికీ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా సహయ సంచాలకులు డాక్టర్ వి.అరుణ రైతులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని ఏదులాపురం గ్రామంలో బుధవారం పశువులకు జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈసందర్భంగా డాక్టర్ వి.అరుణ మాట్లాడుతు రైతులను పశువులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. ఏ చిన్న వ్యాధి సోకినా వెంటనే పశువైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామంలో మొత్తం 197 పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనంతు హరీష్, సిబ్బంది రవికుమార్, పాషా, రామారావు, గోపాల మిత్రలు వెంకటేశ్వర్లు, అలీ, శ్రీను, సందీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఏదులాపురంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎం సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోరిక మేరకు పుణ్యక్షేత్రాలుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. బుధవారం ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయం ఖమ్మంలో రీజియన్‌లో ఉన్న ఏడు డిపో మేనేజర్లు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచారామాలకు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 8 గంటలకు జిల్లాలోని అన్ని బస్‌స్టేషన్ నుంచి బయలుదేరేలా అన్ని ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లకు సూపర్‌వై జర్లకు ఆదేశాలు జారీచేశారు. పంచారామాలు అన్నవరానికి సంబంధిం చిన పోస్టర్ను రీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఆర్ఎం సరిరామ్ ఆవిష్కరించారు. పంచారామాలు వెళ్ళుటకు చార్జీలు పెద్దలకు రూ.2300, పిల్లలకు రూ.1200లు, అన్నవరం వెళ్ళుటకు చార్జీలు పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.420లు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ సంపత్, డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు



రికార్డులను తనిఖీ చేస్తున్న శశిశ్రీ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రి ని టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శశిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శశిశ్రీ ఆస్పత్రిలో వార్డులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, డ్రగ్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. సబ్ డ్రగ్‌స్టోర్స్‌లో, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌లో వివిధ మందుల సరఫరా విధానాన్ని, ఉపయోగాన్ని, ఈ-ఔషధీ ఆన్‌లైన్ పోర్టల్‌ను పరిశీలించారు. ప్రతీ వార్డులో ఉన్న రిజిస్టర్స్, రికార్డ్స్, పేషంట్ కేస్ షీట్ లను పరిశీలించారు. ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన పరికరాలు, పని తీరు, ఎక్స్పైరీ డేట్స్ పరిశీలించారు. ఆసుపత్రిలోని పరికరాల గురించి తెలుసుకున్నారు. రూ.5లక్షలకు పైబడిన ఆస్పత్రి పరికరాలను ఏడాదికోమారు నిర్వహణ చేపట్టాలని సూచించారు.ఆమె వెంట ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ నరేందర్, హెచ్ఈఈఓ. వి.రవి కుమార్, ఎం.దుర్గ, ఎన్‌హెచ్ఎండీపీవో బయోమెడికల్ ఇంజనీర్, ఇస్లావత్‌రెడ్డి, ఫార్మసీ సూపర్వైజర్ వై.పద్మావతి తదితరులున్నారు.

గంజాయి పట్టుకొస్తున్న యువకుల అరెస్ట్

కామేపల్లి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి గంజాయి కొనుగోలు చేసుకొని వస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొని అరెస్ట్ చేసిన సంఘటన కామేపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన పల్లపు వేణు, ముచ్చర్ల గ్రామానికి చెందిన షేక్ యాసిన్ అనే ఇద్దరు యువకులు కలిసి ఒరిస్సాలో అభి అనే వ్యక్తి వద్ద 1.450కేజీల గంజాయి కొనుగోలు చేసుకొని వస్తుండగా.. అక్టోబరు 14న సాయంత్రం పోలీసులు ముచ్చర్ల క్రాస్‌రోడ్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా వారిని చూసి పారిపోతుడంగా.. పట్టుకొని విచారించగా బ్యాగ్‌లో రెండు ప్యాకెట్లు గంజాయి ఉందని తెలిపినట్లు చెప్పారు వారి ఇద్దరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి సూచన మేరకు కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి వారి రిమాండ్ నిమిత్తం ఖమ్మం కోర్టుకు తరలించారు. అభి పరారీలో ఉన్నాడని, గంజాయి విలువ రూ.74వేల వరకు ఉంటుందని తెలిపారు.



సీపీఐ వందేళ్ల వేడుకను పండుగలా జరుపుకోవాలి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల వేడుకను పండుగలా జరుపుకోవాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతుందన్నారు. ఈ వందేళ్ల కాలంలో సీపీఐ చేసిన పోరాటాలు, సంస్కరణలకు విస్తృతస్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. ఈ వేడుకకు 30 దేశాల నుండి ప్రతినిధులు హాజరు కాబోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెంకటరెడ్డి, ఉన్నం రంగారావు, భాస్కర్, మండల కార్యదర్శి సుధాకర్, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందున్న ఖమ్మం నగరం

» మేయర్ పునుకొల్లు నీరజ



డ్రైయినేజీలకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఖమ్మం నగరం ముందు వరసలో ఉందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. 50వ డివిజన్‌లో రూ.20లక్షల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్‌తో కలిసి బుధవారం శంకుస్థాపనలు చేశారు. కార్పొరేటర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల 50వ డివిజన్‌కు మంజూరు చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కాంగ్రెస్ నాయకులు బీరెడ్డి రమేశ్, ఉమర్, గంటా భీమయ్య, మన్నేటి నాగేశ్వరరావు, కిషోర్, జానీ, తిగల నరేశ్, రాపర్తి సంతోష్, శ్రీనివాస్, జోగేంద్ర పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న నరేశ్‌రెడ్డి

తిరుమలాయపాలెం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరో పదిమందికి ఆయుషుపోయవచ్చని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సుబ్లేడులో రామసహాయం నరేశ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసి ప్రాణపాయంలో న్నవారికి అండగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మందడి ఇజ్రాయేల్, బానతు రంగా, కె.శ్రీనివాసరెడ్డి, శ్రీను, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలు నిర్మించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల బీసీ బిడ్డల కోసం రాజ్యాంగబద్ధమైన మన హక్కులు సాధించడం కోసం అన్ని బీసీ కుల సంఘాలు ఒక్కటిగా ఐక్య ఉద్యమాలు నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బీసీ బంద్‌ను విజయవంతం కావడానికి వివిధ కుల సంఘాల నాయకులతో బుధవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈనెల 18న జరిగే బంద్‌ను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బంద్ విజయవంతం కోసం కన్వీనర్లను నియమించారు. ఈసమావేశంలో జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, మసనం శివరామకృష్ణ, గద్దె వెంకటరామయ్య, పిండిప్రోలు రామ్మూర్తి, లింగనబోయిన పుల్లారావు, బత్తిని మధుగౌడ్, పెల్లూరు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి: ఏడీఏ

నేలకొండపల్లి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): సకాలంలో వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుంటూ వరి పైరును ఆశిస్తున్న చీడ, పీడలను నివారించటం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు సతీష్ రైతులను కోరారు. బుధవారం ఏవో రాధతో కలిసి పైనంపల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో భవాని, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ ఆ నలుగురే!

(7వ పేజీ తరువాయి)

తెలియనట్టు అక్కడా ఇక్కడా తమదే దందా అన్నట్టు నడిపించేస్తున్నారు. ఒక వ్యక్తి మాత్రం బినామీ పేర్లతో సుమారు 5కు పైగా దరఖాస్తులు చేశారని వ్యాపారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

సిండికేట్ అక్రమ వసూళ్లు..

నగరంలో దీపావళి సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసే వారి వద్ద నుంచి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా ఆ నలుగురు వ్యక్తులు అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో షాపు యజమాని నుంచి సుమారు రూ.26వేల వరకు వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఖమ్మంనగరంలో ప్రతీ ఏడాది ఒక్క ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్‌మైదానంలో మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేవారు. ఈ ఏడాది పెవిలియన్‌గ్రౌండ్‌లో కూడా అనమతివ్వడంతో నలుగురు వ్యక్తుల దందాకు పట్టపగ్గాల్లేకుండా పోయాయని ప్రచారం జరుగుతోంది. సాధారణ వ్యాపారులు నుంచి కూడా దందా పేరుతో వసూలు చేస్తుండడంతో వారి స్థాయికి మించి డబ్బులు తెచ్చి ఇప్పటికే పెట్టుబడి పెట్టామని మొరపెట్టుకుంటున్నా ఇస్తేనే షాపులు నడుస్తాయంటూ సిండికేట్ సభ్యులు కావాలని ప్రచారం చేస్తున్నట్టు సమాచారం. కాగా షాపుల యజమానులు మాత్రం వసూళ్ల దందా విషయాన్ని బయటపెట్టేందుకు నిరాకరిస్తున్నారు. అయితే టపాసుల షాపు ఏర్పాటుకు దరఖాస్తు చేసిన తర్వాత సిండికేట్ దళారులు వసూలు చేస్తున్నారు. వీటినుంచి ఇప్పటికే ఒక్కోషాపునకు రూ.3వేల చొప్పున ఒక శాఖకు ముందుగానే ముట్టజెప్పారని, మరోశాఖకు మంగళవారం రూ.3వేల చొప్పున ఇచ్చినట్టు సమాచారం. కొందరు సిబ్బంది నేరుగా కార్యాలయాల్లోనే నగదు తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే సిండికేట్ దందా చేస్తున్న వారు.. అన్ని ఖర్చులు కలిపి గతేడాది రూ.18వేలు వసూలు చేశారని, కానీ ఈ ఏడాది మాత్రం ఖర్చులు పెరిగాయంటూ రూ.26వేలు డిమాండ్ చేస్తున్నారని కొందరు దరఖాస్తుదారులు వాపోతున్నారు. వీటిల్లో షెడ్ నిర్మాణానికి రూ.20వేలు, మైదానంఅనుమతికోసం రూ.6వేలు అని చెబుతున్నట్టు తెలుస్తోంది.

అక్రమంగా వసూళ్లు చేస్తే కఠిన చర్యలు : ఏడీసీపీ

బాణసంచా దుకాణాల ముసుగులో డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఏడీసీపీ ప్రసాదరావు హెచ్చరించారు. బుధవారం ఖమ్మం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డ్రా పద్ధతిలో షాపులు కేటాయించగా..ఈ కార్యక్రమంలో ఏడీసీపీ మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానంలో 86షాపులు, పెవిలియన్ గ్రౌండ్‌లో 42షాపులు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించామన్నారు. ఈమేరకు వ్యాపారులతో మాట్లాడి వారి ఆధ్వర్యంలో డ్రా తీశామన్నారు. ఈడ్రాలో కేటాయించిన షాపుల నెంబర్లను సంబంధిత వ్యాపారులకు వివరించారు. అనుమతిలేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా చట్టపరంగా చర్యలుతీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, టుటౌన్ సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

దూరాభారంగా బస్టాప్

» ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న బస్టాప్‌ను ఐటీ హబ్ పక్కకు మార్చిన అధికారులు

» పాత బస్టాప్‌లోనే ప్రయాణికులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తీసుకున్న నిర్ణయాలకు ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు. నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద గల బస్టాప్‌ను గత నెలలో తీసివేసిన అధికారులు గత కొన్ని రోజులుగా బస్టాప్ లేకుండానే ప్రయాణికులు ప్రయాణాలు సాగించారు. వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం కావటంతో వర్షంలో తడుస్తూ బస్సుల కోసం వేచిఉండే వారు. ప్రస్తుతం బస్టాప్‌ను ఇల్లెందు క్రాస్ రోడ్ పోలీస్ స్టేషన్ నుంచి తీసివేసి ఐటి హబ్ ప్రక్కకు దూరంగా ఏర్పాటు చేయటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దూరా భారం పెరిగిందని వారు వాపోతున్నారు. బస్సు దిగి క్రాస్ రోడ్డు రావాలంటే దాదాపు 500ల మీటర్లకు పైగానే నడవాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు పాత బస్టాప్ వద్ద ఆగి బస్సులు ఎక్కుతున్నారు. ఆర్టీసీ బస్సులు కూడా కొత్తగా ఏర్పాటు చేసిన బస్ స్టాప్‌లో కాకుండా పాత బసుస్టాప్‌లోనే ఆగుతున్నాయి. బస్టాప్ ఎందుకు తీసినట్లో తెలియని పరిస్థితి. డ్రైనేజీ పనులకు అడ్డంగా ఉందని తీసివేసిన అధికారులు మరలా అక్కడే బస్టాప్‌ను ఏర్పాటు చేయకుండా దూరంగా ఏర్పాటు చేయటంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత స్థలంలోనే బస్టాప్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాత బస్టాప్ వద్ద ప్రయాణికులు



పాత బస్టాప్ వద్దనే ఆగుతున్న బస్సులు



ప్రయాణికులు లేని కొత్త బస్టాప్

గుండెపోటుతో వృద్ధుడి మృతి



పుల్లయ్య(ఫైల్)

కూసుమంచి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ పనికి వెళ్లిన కొంగర పుల్లయ్య(70) అనే వ్యక్తి పని ప్రదేశంలో హఠాత్తుగా మృతి చెందారు. మండల కేంద్రంలోని గ్లోబల్ స్కూల్ వద్ద పనికి ఆహార పథకంలో భాగంగా మొక్కలు నాటే పనికి కొంగర పుల్లయ్య హాజరయ్యాడు. మొక్కలు నాటిన అనంతరం పని ప్రదేశం నుంచి ఫోటో తీసి అధికారులకు పంపే పనిలో ఉండగా హఠాత్తుగా పుల్లయ్య కుప్పకూలిపోయినట్లు తెలుస్తున్నది. అక్కడే ఉన్న వారు సీపీఆర్ చేసినప్పటికీ ఉపయోగం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పీడీఎస్‌యూ మహాసభను విజయవంతం చేయండి

ఖమ్మం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో అక్టోబరు 23న జరిగే పీడీఎస్‌యూ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బుధవారం గణేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేసేది పీడీఎస్‌యూ మాత్రమేనన్నారు. పీడీఎస్‌యూ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీసీ బిల్లు అమలుకు అడ్డుకట్ట వేస్తున్న కేంద్రం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఖమ్మం అర్బన్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ బిల్లు అమలు విషయమై కేంద్రం రాజకీయ ఆటలాడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ఆరోపించారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో యర్రాశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం రాజకీయ దురుద్దేశ్యంతోనే బీసీ రిజర్వేషన్ అమలు కాకుండా అడ్డుకుంటోందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అసెంబ్లీలో చర్చపెట్టిందని ఆసమయంలో అన్ని పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. అసెంబ్లీ ఆమోదంతో బిల్లును పంపినా ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను నిర్వీర్యంచేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. బీసీ బిల్లు అమలుకు అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీకి తీసుకువెళ్లి వత్తిడి తేవాలన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు కాక పోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. స్థానిక ప్రభుత్వాలు లేక పోవటం వల్ల గ్రామాల్లో అభివృద్ధికుంటుపడిందని ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు కనుక వెంటనే స్థానిక ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రమేష్, వై. విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతురాంబాబు, మాదినేని రమేష్, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వైద్యులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ ఐఏపీ, ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ఐఎంఏ హాల్లో చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలను నిర్వహించారు.. ఐఏపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ సాయిభార్గవ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ హాస్పిటల్ కి చెందిన చిన్నారుల గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ చిన్న స్వామి రెడ్డి, డాక్టర్ లింగస్వామి చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మంది గుండె సంబంధిత చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

విరాళం అందజేత

కామేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని పొన్నెకల్ జడ్పీఎస్ఎస్ పాఠశాలకు ఎన్ఆర్ఐ దారావత్ మోహన్ నాయక్ రూ. 20వేల ఆర్థిక సహాయం చేశారు. బుధవారం హెచ్ఎంకు నగదును అందజేశారు. ఈ నగదు పాఠశాలలోని గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలి

» ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్

ఖమ్మం అర్బన్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల్లో సదుపాయాలు మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ మార్కెట్‌లో 'ఛాంబర్' ఎన్నికల ప్రచారం

ఖమ్మం మార్కెట్ , అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బుధవారం మేళ్ళచెర్వు వెంకటేశ్వరరావు ప్యానల్ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓట్లు కలిగిన వ్యాపారులను కలిసి తమ ప్యానల్‌కు ఎన్నికలలో మద్ధతు ప్రకటించాలని కోరారు. నవంబర్ 16న జరుగనున్న ఎన్నికలలో అందరూ ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, సోమా నర్సింహరావు, తల్లాడ రమేష్, ముత్యం ఉప్పల్‌రావు పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు విద్యార్థిని గణేష్ హాలయ ఎంపికైందని ఎస్‌బీఐటీ కళాశాల యజమాన్యం తెలిపింది. హాలయ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైందని వారు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆమెను కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ శివ ప్రసాద్, జె. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐటీలో....

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు విద్యార్థిని పసుపులేటి వీక్ష ఎంపికైందని స్మార్ట్ కిడ్స్ పాఠశాల యజమాన్యం తెలిపింది. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందని వారు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వీక్షను కళాశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య, తదితరులు అభినందించారు.



వీక్షను అభినందిస్తున్న స్మార్ట్‌కిడ్స్ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ చైతన్య

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా


ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల పెండింగ్ బకాయిలును విడుదలచేయాలని కోరుతూ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య మాట్లాడుతూ గత 18నెలలుగారిటైర్ అయిన ఉద్యోగుల జీపీఎఫ్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ సరెండర్ లీవ్ తదితర ఆర్థిక బకాయిలను విడుదల చేయకపోవడంతో రిటైర్డు ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం పెన్షనర్ల బకాయిల విడుదల చేయాలనికోరుతూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య, తాళ్లూరి వేణు, టి.జనార్ధన్, డీకేశర్మ, తదితరులున్నారు.

ఘనంగా అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం

ఖమ్మంఖానాపురమవేలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అణుశాస్త్ర విజ్ఞానానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని నిర్వహించే అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని న్యూవిజన్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన అబ్దుల్ కలాం సామాన్య స్థాయి నుంచి భారత ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి స్థాయి ఎదగడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ ఎండీ.అబాద్ అలీ, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు

పత్తి రైతులను ఆదుకోవాలి: రైతు సంఘం

ఖమ్మం అర్బన్ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లాకార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఏడాది అతివృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి కూచిపూడి రవి, మల్లికార్జునరావు తదితరులున్నారు.



రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

- అధికార యంత్రాంగం సిద్ధం కావాలి
- 72 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్, అధికారులు



వీసీలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇతర అధికారులు

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా రికార్డు స్థాయిలో వానాకాలం పంట కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాల, వ్యవసాయశాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నుంచి వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశ చరిత్రలో అత్యధికంగా వరి పంట సాగు విస్తీర్ణం తెలంగాణలోనే జరుగుతుందన్నారు. రాబోయే వానాకాలం అత్యధికంగా పంట కొనుగోళ్లను రాష్ట్రం చేయబోతుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలన్నారు. ధాన్యం రవాణా కాంట్రాక్ట్ ఖరారు చేసే ముందు సరిపడా వాహనాలను సరఫరా చేసేందుకు అర్హత ఉందో లేదో పరిశీలించాలని మంత్రి సూచించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్నీబ్యాగులు, వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదురు చూసే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. అవసరమైన వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్ ఎంట్రీ జరిగేలా సిబ్బంది నియమించుకోవాలని, 2025 వానాకాలం సీజన్ లో ధాన్యం డబ్బులు 48 నుంచి 72 గంటలలోగా రైతుల ఖాతాలలో జమ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని ప్రభుత్వానికి మంచి పేరు ఉందన్నారు. గత రెండు సంవత్సరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత సీజన్ మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను వరి కోతల కంటే ముందుగానే ప్రారంభించాలన్నారు. దీపావళి తర్వాత వరి కోతలు వేగం కానున్న నేపథ్యంలో జిలాల్లో గన్నీ బ్యాగులు, ధాన్యం రవాణా ఏర్పాట్లు, ధాన్యం సెంటర్లలో మౌళిక సదుపాయాలకు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రమ పద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చూడాలని అన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఒకే చోట కొనుగోలు చేస్తే రైతులకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక కౌంటర్లు పెట్టాలని, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా రవాణా చేయాలన్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. జిల్లాలోని 5 వ్యవసాయ మార్కెట్ యార్డుల వద్ద డ్రైయర్లను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న మ్యానువల్ ప్యాడీ క్లీనర్లను కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలన్నారు. జిల్లాలో గ్రామ పరిపాలన అధికారులకు కొనుగోలు కేంద్రాల వద్ద విధులు కేటాయించాలని, దీనికి సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేయాలని, గ్రామ పాలన అధికారుల ద్వారానే రిపోర్ట్ సేకరణ ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అధికారులు తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనంతరం భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ మాట్లాడుతూ.. ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లను పూర్తిస్థాయి లో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం కల్పించామన్నారు. జిల్లాలో మొత్తం 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, సుమారు 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగవచ్చని అంచనా వేశామని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, తడిపరీక్ష పరికరాలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచామ ని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే చెల్లింపులు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ వానాకాలం కొనుగోళ్లు రైతులకు సౌకర్యవంతంగా, పారదర్శకంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, జిల్లా రవాణాధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారిని రుక్మిణి అధికారులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో బాల సాహిత్యకారుడు పోతురాజు

గుడిసెలో ఉదయించిన సాహితీ కిరణం

● పదవ తరగతిలోనే పోతురాజు కథల పుస్తకాలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పద్నాలుగేళ్లకే పోతురాజు కథల పుస్తకాలను రచించాడు. త్వరలోనే ఆవిష్కరణకు సిద్ధమవుతుండగా.. వీటిని దాతల సహకారంతో సత్తుపల్లికి చెందిన గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ ప్రచురించనుంది. పట్టణంలోని గుడిపాడు శివారుల్లో గుడిసెలలో నివాసం ఉంటున్న ఆవుల యాకయ్య, తిరుపతమ్మ దంపతుల కుమారుడు పోతురాజు. ఇతను స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతూ బాల సాహిత్యకారుడిగా ఇరవై కథలు రాశాడు. గతేడాది వేమన శతకంలోని 100పద్యాలు నేర్చుకుని అవధానం చేయగా.. కథలు రాసే నైపుణ్యాన్ని గ్రహించిన తెలుగు భాషోపాధ్యాయుని ఎం.రమాదేవి ప్రోత్సహించడంతో నేడు పోతురాజు కథలు త్వరలోనే ప్రపంచానికి తెలియనున్నాయి. సంచార జాతులకు చెందిన గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన పోతురాజు కుటుంబం జీవన భృతి కోసం పదేళ్ల క్రితం పెనుబల్లి మండలం టేకులపల్లి నుంచి వలస వచ్చి గంగిరెద్దులను ఆడిస్తూ మేళం వాయిస్తూ జీవిస్తున్నారు.

కానిస్టేబుల్ రవికిషోర్‌కు ఉత్కృష్ట సేవాపతకం



రవికిషోర్‌ను అభినందిస్తున్న సీపీ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ చేతులమీదుగా సత్తుపల్లి పోలీస్ కానిస్టేబుల్ జి. రవికిషోర్ (పీసీ 2334) ఉత్కృష్ట సేవా పతకాన్ని బుధవారం ఖమ్మంలో అందుకున్నారు. రవికిషోర్ గతంలో రఘునాధపాలెం పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్ (సీడీఓ)గా పని చేస్తున్న సమయంలో.. రెండు పో క్సో కేసుల కేసుల ఘటనల్లో అత్యుత్తమంగా విధులు నిర్వహించినం దుకు ఈ ఉత్కృష్ట సేవాపతక లభించింది. ఈ సందర్భంగా రవికిషోర్‌ను కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, సత్తుపల్లి టౌన్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

కొండయ్యకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కార్ అవార్డు

ఏన్కూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన సీపీ సునీల్‌దత్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. కొండయ్య గత 35ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తూ వస్తున్నారు. 4 ఏళ్ల నుంచి ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో పెట్రోకార్ ఇన్‌చార్జ్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలోనూ కొండయ్య ఎన్నో అవార్డులు పొందారు. కాగా.. అవార్డుకు ఎంపికైన కొండయ్యను ఎస్సై నారబోయిన సంధ్య, సిబ్బంది అభినందించారు.



ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన తెల్ల బంగారం

ఈ సీజన్‌లో తొలిసారి 25 వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్ , అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు తెల్లబంగారం (పత్తి) పోటెత్తింది. బుధవారం సుమారు 25 వేల పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక మార్కెట్‌కు ఇంత భారీ మొత్తంలో పంట రావడం ఇదే ప్రథమం. జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పత్తి దిగుబడి భారీగా తగ్గింది. మార్కెట్‌కు రెండు రోజులుగా సుమారు 15 వేల నుంచి 17వేల బస్తాలకు పైగా అమ్మకానికి రాగా.. బుధవారం ఒక్క రోజే 25వేలకు పైగా బస్తాలు రావడం విశేషం. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు తిరోగమన దశలో ఉన్న నేపథ్యంలో రైతులు పంటను వడివడిగా సేకరించి అమ్మకానికి తెస్తున్నారు. ఇదిలా ఉండగా.. మార్కెట్‌లో క్వింటా పత్తి గరిష్ఠంగా రూ. 7,211 పలకగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ.4,600 నుంచి రూ.7,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. బుధవారం పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు, పత్తి యార్డ్ ఇన్‌చార్జ్ ప్రసాద్, తదితరులు సమీక్షించారు.

మృత్యువులోనూ వీడని బంధం

భర్త దశదిన కర్మకు ముందురోజే భార్య మృతి

సత్తుపల్లి మండలం రేజర్లలో విషాదం



మృతులు పుల్లారెడ్డి, సత్యవతి దంపతులు (ఫైల్)

సత్తుపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అన్యోన్య దాంపత్యానికి సాక్షిగా నిలిచిన ఈ దంపతులు మృత్యువులోనూ తమ బంధాన్ని వీడలేదు. భర్త అనారోగ్యంతో చనిపోగా.. ఆయన దశదిన కర్మకు ముందురోజే భార్య మృతి చెందడం ఖమ్మం జిల్లాలో బుధవారం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. సత్తుపల్లి మండలంలోని రేజర్ల గ్రామానికి చెందిన నంద్యాల పుల్లారెడ్డి (103) అనే శతాధిక వృద్ధుడు ఈనెల 2వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటివరకు తోడుగా ఉన్న భర్త మరణాన్ని తలుచుకుంటూ ఉన్న భార్య సత్యవతి (83)ని ఎందరు ఓదార్చినా ఊరడిల్లలేదు. భర్త మృతిని తట్టుకోలేక దశదిన కర్మకు ముందురోజైన 13వ రోజు బుధవారం సత్యవతి గుండెపోటుతో మృతి చెందింది. దీంతో రేజర్ల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రెండు వారాల వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. వీరికి ఒక కుమారుడు వెంకటరెడ్డి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వెంకటరెడ్డి ప్రస్తుతం బీఆర్ ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండగా. పీఏసీఎస్ అధ్యక్షుడిగానూ పనిచేశారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆ కుటుంబాన్ని ఫోన్‌లో సంప్రదించి ఓదార్చారు.

ప్రేమ పేరుతో మోసపోయిన యువతి

అవమాన భారంతో యువతి తల్లి ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):పెళ్లి పేరుతో యువతి మోసపోగా, అవమానభారంతో ఆమె తల్లి బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. డబ్బులెల్ రేగుబల్లి గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ, పెళ్లి పేరుతో స్థానిక యువతిని శారీరకంగా లొంగదీసుకున్నాడు. తర్వాత గర్భిణి అయిన యువతి తనను పెళ్లి చేసుకోవాలని కోరగా.. జైలుకైనా వెళ్తాను గానీ పెళ్లి చేసుకోబోనని యువకుడు తెగేసి చెప్పాడు. ఈ విషయం తెలిసిన బాధిత యువతి తల్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను తొలుత నరసాపురం పీహెచ్‌సీకి తరలించగా.. పరిస్థితి విషమంగా మారడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా.. సదరు యువకుడు మరో యువతితో తాను దిగిన ఫొటోలు చూపిస్తూ.. ఆ యువతితో తనకు పెళ్లి అయిందని, వేరొకరిని ఎలా పెళ్లి చేసుకుంటానని అంటున్నట్లు తెలుస్తోంది. బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- రైతులకు మద్దతు ధర కల్పిస్తాం
- పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలి
- వానాకాలం పంటల కనీస మద్దతు ధరపై వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన చివరి గింజను కూడా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి వానాకాలం పంటల కనీస మద్దతు ధరపై వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాదికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పంటలకు మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాకు 2389 రూపాయలతో పాటు 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి 2369లను కల్పించిందన్నారు. పత్తి (పొడవు పింజ)రూ. 8110, పత్తి (మధ్యస్థ పింజ) 7710 రూపాయలు, మొక్కజొన్నకు 2400, కందులకు రూ. 8 వేలు, పెసలకు 8768, వేరుశనగ కాయలకు 7263, మినుములు 7800, పొద్దు తిరుగుడుకు రూ. 7721, సోయాబీన్‌కు 5328, నువ్వులకు 9846, సజ్జలు 2775, రాగులకు 4886 రూపాయల మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులో తమ పంటను కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, సన్న రకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయల బోనస్ కూడా అందిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని పత్తి విక్రయానికి నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. పత్తి కొనుగోలు సేవల కోసం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్

కేంద్ర విధానాలపై మిలిటెంట్ పోరాటాలు

- బీసీ రిజర్వేషన్ల పెంపుపై పార్లమెంట్‌లో చట్టం చేయాలి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

జూలూరుపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక, కర్షక, రాజకీయ పార్టీలను ఐక్యం చేసి.. త్వరలోనే జాతీయ స్థాయిలో మిలిటెంట్ పోరాటాలను చేపడతామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. బుధవారం జూలూరుపాడులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో.. నవంబరు 26న దేశంలోని 700 జిల్లా కేంద్రాలలోని కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేస్తామన్నారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 19న దేశ వ్యాప్తంగా సడక్ బంద్‌లు, దిగ్బంధాలు, తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడంతో.. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం వంటి సంక్లిష్ట పరిస్థితులకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సి ఉండగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నట్లు బీజేపీ నటిస్తూనే.. మరోవైపు వీటిని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నప్పటికీ.. పెంచిన రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా ప్రధానమంత్రి మోదీ మోకాలడ్డడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆనాడు 50శాతానికి రిజర్వేషన్లు మించకూడదని అభిప్రాయాన్ని చెప్పిందని, కానీ ఆ తీర్పు వచ్చిన తర్వాత ఈడబ్ల్యూఎస్‌కి 10శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు ఇవ్వడంతో దాన్ని అన్ని పార్టీలు బలపరచడం జరిగిందన్నారు. 50శాతానికి మించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఏ రాజకీయ పార్టీ అభ్యంతరాలు తెలియజేయలేదని, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో యూరియా కృత్రిమ కొరతను కేంద్ర ప్రభుత్వమే సృష్టించిందని విమర్శించారు. జీఎస్టీతో ప్రజలకు తీవ్ర నష్టం కలిగిందని, తక్షణమే జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన డీఏస్సీ సబ్బతి విష్ణుమూర్తి, దుద్దుకూరి గోపయ్య కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు గార్లపాటి వెంకటి, వల్లమల చందర్‌రావు, బొల్లి లక్ష్మయ్య, బొడా అభిమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మహిళ మృతదేహం

పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు

జయమ్మకాలనీకి చెందిన షేక్ మెహబూబీగా గుర్తింపు

అన్ని కోణాల్లో విచారిస్తున్న పోలీసులు

పాల్వంచ, అక్టోబరు 15 : కాలువలో పడిఉన్న మహిళ మృతదేహాన్ని(35) బుధవారం రాత్రి పాల్వంచ శ్రీనివాసకాలనీ వాసులు గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనివాసకాలనీ మినీ స్టేడియం సమీపంలోని పాత ఇనుప సామాను దుకాణంలోని సిబ్బంది పనికి రాని చెత్తను తగులబెట్టడానికి సమీప మోరీ వద్దకు వెళ్లారు. దీంతో మోరీలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మోరీలో ఇరుకున్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం ప్రాథమిక విచారణ జరిపి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా.. సదరు మహిళ జయమ్మకాలనీకి చెందిన షేక్ మహబూబీగా పోలీసులు గుర్తించారు. ఆమె గృహిణి అని, ఆమె భర్త తాపీ మేస్త్రీ అని తెలియవచ్చింది. కానీ ఆమె అక్కడకు ఎందుకు వెళ్లింది !? ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయిందా!? లేక ఎవరైనా హత్య చేసి పడేసారా!? లేక ఆమే ఆత్మహత్య చేసుకుందా!? అని వివిధ కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాల్వంచ టౌన్ ఎస్సై సుమన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

జూలూరుపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని గంగారంతండా గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గంగారంతండాకు చెందిన రైతు అంగోత్ కృష్ణ తన దుక్కిటెద్దులను పొలానికి తీసుకొని వెళ్లాడు. ఈ క్రమంలో ఓ ఎద్దు మేత మేసుకుంటూ వెళ్లి.. రైతు చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన వైరుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 70వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

కోడిపుంజుల దొంగలను పట్టుకున్న గ్రామస్థులు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాత బట్టలు కొంటామనే పేరుతో కోడిపుంజులను చోరీ చేస్తున్న భార్యభర్తలను గ్రామస్థులు పట్టుకోబోగా.. భర్త తప్పించుకున్న ఘటన మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత మామిళ్లవారి గూడెంలో భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ కోడిపుంజులను చోరీ చేస్తున్నారు. ఓప్రదేశంలో కోడిపుంజును చోరీచేస్తుండగా.. గమనించిన గ్రామస్తులు ఇద్దరిని పట్టుకున్నారు. ఇదే సమయంలో బండిపై వెళుతున్న మహిళ జారిపడి కిందపడగా భర్త ద్విచక్ర వాహనంపై రెడ్డిగూడెం వైపునకు పరారయ్యాడు. అనంతరం మహిళను పట్టుకున్న గ్రామస్తులు ఓచోట కూర్చోబెట్టారు. మహిళ వద్ద ఉన్న సంచిలో బియ్యం, బ్లేడు ఉన్నాయి. పట్టుకున్న కోడిపుంజులతో మరో వ్యక్తి పరారయ్యాడు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళను వివరాలు అడగా తమపేర్లు వెంకటేశ్వరావు, వెంకటలక్ష్మీ అని తమది సారపాక అని ఒకసారి అశ్వారావుపేట అని మరోసారి పొంతనలేని సమాధానాలు చెప్పింది. గడిచిన కొద్దిరోజులుగా రెడ్డిగూడెం, తిరుమలకుంట, మామిళ్లవారిగూడెం ప్రాంతాల్లో పందెం పుంజులు మాయంకావటంతో వీళ్ల కోడిపుంజులను దొంగిలించటానికి వచ్చినట్లుగా గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు.

గుండెపోటుతో వ్యాపారి హఠాన్మరణం



షేక్ పాషా (ఫైల్)

తల్లాడ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : తల్లాడలో ప్రముఖ వ్యాపారవేత్త షేక్ పాషా(63) గుండెపోటుతో బుధవారం హఠాన్మరణం చెదంఆడు పాషాకు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. రెండు దశాబ్దాలుగా పాషా మద్యం వ్యాపారం చేస్తూ జిల్లాలోనే ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందాడు. ఇటీవల తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ బీసీకి రిజర్వుకావడంతో కాంగ్రెస్‌పార్టీ తరుపున సర్పంచ్ పదవికి పోటీచేసే ప్రయత్నంలో ఉండగా.. అకాల మృతి చెందడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో విషాదం నెలకొంది. పాషా మృతదేహాన్ని వివిధ రాజకీయపార్టీల నేతలు వ్యాపార ప్రముఖులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. తల్లాడ పురవీదుల్లో పూలుచల్లుతు బాణసంచా కాలుస్తూ అంతిమయాత్ర నిర్వహించారు అనంతరం మృతదేహాన్ని పాషా జన్మస్థలమైన కొదుమూరుకు తరలించారు.

వాహన తనిఖీలు.. ఒకరి అరెస్టు

- విచారణలో బయటపడ్డ చోరీ.. నగలు స్వాధీనం

చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి పట్టుబడగా.. విచారణలో సదకు వ్యక్తి చేసిన దొంగతనం బయటపడ్డ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు బుధవారం చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల మండలం సుబ్బంపేట గ్రామ శివారులో చర్ల పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. వెంకటాపురం మండలం సురవీడు గ్రామానికి చెందిన ముత్యబోయిన ప్రేమ్‌చంద్‌గా గుర్తించారు. చర్ల మండలం గాంధీనగర్ గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనలో నిందితుడు అని తేలింది. ప్రేమ్ చంద్ కొద్ది రోజుల క్రితం గాంధీనగర్ గ్రామానికి వచ్చి మిత్రుడి ఇంట్లో మూడు రోజుల పాటు ఉన్నాడు. ఈ సమయంలో గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గమనించాడు. 9 తేదీ అర్ధరాత్రి కోడి రెక్కల భాస్కర్‌రావు ఇంట్లో చొరబడి రూ. 66 వేల విలువైన ఆభరణాలు, 80 వేల నగదు చోరీ చేశాడు. ఇదే క్రమంలో చర్ల మండలానికి వస్తుండగా వాహన తనిఖీల్లో చర్ల పోలీసులకు పట్టుబడ్డాడు. ప్రేమ్‌చంద్ దొంగతనం చేసిన విధానం, ఇతర వివరాలను విచారణలో ఒప్పుకున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ వివరించారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై సర్సిరెడ్డి ఉన్నారు.

కాపర్ వైర్ దొంగల హల్‌చల్

కరకగూడెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం అవడం మారుమూల గ్రామాలు ఉండటంతో దొంగలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఎక్కువగా వ్యవసాయ పొలాలు ఉంటాయి. రైతులు తమ పొలాల వద్ద మోటార్లకు ట్రాన్స్ఫార్మర్‌లు ఉంటాయి. ఇదే అదునుగా చూస్తున్న దొంగలు రాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగల కొట్టి అందులో కాపర్ వైర్లు దొంగిలిస్తూ మండలంలో హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వీరాపురం క్రాస్ రోడ్డు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు కింద పడవేసి అందులోని కాపర్ వైర్లు అపహరించారు. కాపర్ విలువ రూ. 40వేలు ఉంటుందని, ఘటనపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ తెలిపారు.

పరారీలో చోరీ నిందితుడు

జూలూరుపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లు, కాపర్ కాయిల్స్ చోరీ చేసిన నిందితుడు కోర్టు నిబంధనలను అతిక్రమించి తప్పించుకుని తిరుగుతున్నాడని ఎస్సై బాదావత్ రవి బుధవారం తెలిపారు. కొత్తగూడెం అశోక్‌నగర్ కాలనీకి చెందిన తమ్మయ్య నాయుడు కోర్టు నిబంధనలను అతిక్రమించడంతో.. కొత్తగూడెం అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు సెక్షన్-82,83 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులను జారీ చేయడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి గురించి సమాచారం ఎవరికైనా తెలిస్తే జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై కోరారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

చింతకాని/బోనకల్ అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2026-26 సంవత్సరానికి పలు వ్యవసాయం యాంత్రీకరణాలను పొందెందుకు చింతకాని మండల రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఏవో సోములపల్లి మానస ఓ ప్రకటనలో తెలిపారు. మాన్యూవల్ స్ప్రేయర్లు 230, పవర్ స్ప్రేయర్లు 32, పవర్ టిల్లర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ వీడర్ 1 కొరకు ఈ నెల 17 నుంచి 24 వరకు రైతువేదికల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీ ఉంటుందని, రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఫొటోలు అందజేయాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ సిద్ధం : బోనకల్ మండలంలో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏవో పి.వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఏన్కూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు రెండు రోజుల నుంచి ఉత్సాహంగా జరిగాయి. బాలికలకు, బాలురకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. మొదటిరోజు బాలికలకు తిమ్మరావుపేటలో, రెండోరోజు బాలురకు స్థానిక గురుకుల పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు.

విజేతలు వీరే..

బాలికల అండర్-17 కబడ్డీలో జడ్పీహెచ్ఎస్ ఏన్కూరు ప్రథమ, తిమ్మరావుపేట జడ్పీహెచ్ఎస్ ద్వితీయ, వాలీబాల్‌లో గుడ్‌న్యూస్ స్కూల్ ప్రథమ, ఏన్కూరు ద్వితీయ బహుమతి, ఖోఖోలో కేజీబీవీ ప్రథమ, తిమ్మరావుపేట ద్వితీయ బహుమతులు సాధించాయి. అండర్-14 కబడ్డీలో గుడ్‌న్యూస్ ప్రథమ, తిమ్మరావుపేట ద్వితీయ, వాలీబాల్‌లో గుడ్‌న్యూస్ స్కూల్ ప్రథమ, జన్నారం ద్వితీయ, ఖోఖోలో గుడ్‌న్యూస్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ తిమ్మరావుపేట ద్వితీయ స్థానం సాధించాయి.

బాలుర విభాగంలో..

అండర్-17 ఖోఖోలో టీజీఆర్ఎస్ గురుకుల ప్రథమ, ఏహెచ్ఎస్ మూలపోచారం ద్వితీయ, వాలీబాల్‌లో ఏహెచ్ఎస్ మూలపోచారం ప్రథమ, సెంట్‌మేరీస్ స్కూల్ ద్వితీయ, అండర్-14 ఖోఖోలో టీజీఆర్ఎస్ గురుకులం ప్రథమ, బురదరాఘవాపురం ద్వితీయ, వాలీబాల్‌లో ఏహెచ్ఎస్ మూలపోచారం ప్రథమ, టీజీఆర్ఎస్ గురుకులం ద్వితీయ స్థానాలు సాధించాయి. ఈ మేరకు విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వాసవీదేవి, ఏఎంసీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాంనాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ వీరయ్య, పీఈటీ, పీడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

ఘనంగా మాజీ రాష్ట్రపతి జయంతి వేడుకలు

బోనకల్/కారేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏ.పీ.జే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకు న్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉన్నదని నమ్మిన కలాం ఆశ యాలకు అనుగుణంగా నేటి యువత పయనించాలని అధ్యాపకులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంతోటి తిరుపతిరావు, మోహన్, జోనాతాన్‌బాబు, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, ప్రేమ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహిస్తున్న అధ్యాపకులు

దేశానికి ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

రాష్ట్రపతి, శాస్త్రవేత్తగా పనిచేసిన అబ్దుల్ కలాం యువతకు ఎంతో ఆదర్శప్రాయుడని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విజయకుమారి అన్నారు. బుధవారం కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అబ్దుల్ కలాం చేసిన సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వీవోలు సుధారాణి, శ్రీనివాసరావు, శేషప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

బోనకల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలతో పాటు ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలను బుధవారం ఎంఈవో దామాల పుల్లయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంజేపీలో భోజన నిర్వహణకు సంబంధించి స్టాక్‌రూమ్, భోజన తయారీని పర్యవేక్షించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఎంఈవో వెంట ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో దామాల పుల్లయ్య

మండల స్థాయి పాఠశాల క్రీడలు ప్రారంభం

చింతకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల స్థాయి పాఠశాలల క్రీడలు బుధవారం ప్రారంభమయ్యాయి. రామకృష్ణాపురం గ్రామంలోని సెయింట్ థెరిసా పాఠశాలలో క్రీడలను ఎంఈవో ఎస్ రామారావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్నాయి. వాలీబాల్ కేజీబీవీ లచ్చగూడెం, బాలికల కబడ్డీ మొదటి బహుమతి శ్రీగ్లోబల్ స్కూల్, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ లచ్చగూడెం, ఖోఖో మొదటి బహుమతి జడ్పీహెచ్ఎస్ కొదుమూరు, ద్వితీయ కేజీబీవీ లచ్చగూడెం గెలుపొందాయి. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. పోటీలకు కన్వీనర్‌గా బ్రదర్ స్టీఫెన్, పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, పీడీలు పునాటి వెంకటేశ్వర్లు, జి.సైదేశ్వరరావు, జివెంకటేశ్వర్లు, ఈశ్వరి, ఎం.సుధాకర్, పీఈటీలు పాల్గొన్నారు.

వరల్డ్ బెస్ట్ గురు అవార్డు అందుకున్న మౌలాలి



అవార్డు అందుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మౌలాలి

కల్లూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పేరువంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎండీ మౌలాలి బుధవారం వరల్డ్ బెస్ట్ గురు అవార్డు అందుకున్నారు. కరీనంగర్ జిల్లా కేంద్రంలో కళాభారతి వేదికపై ఈ అవార్డు అందజేశారు. భారతదేశ 11వ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి, వరల్డ్ స్టూడెంట్ డే సందర్భంగా జీఎస్‌పీ ఎడ్యూకేషన్ సొసైటీ, కవులు, కళాకారులు, రచయితల సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మౌలాలీని శాలువతో సత్కరిస్తూ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్‌పీ ఎడ్యూకేషన్ సొసైటీ అధ్యక్షుడు జి.మల్లేశం మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, మానవతా విలువలు, సామాజిక బాధ్యతలు నింపటమే కాకుండ, జ్ఞానం, అచరణ, సేవ అనే త్రివేణి సూత్రంతో మౌలాలి విద్యాబోధన అందిస్తున్నారన్నారు. ఇంకాను విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, ఆలోచనాపరులుగా ఎదగాలని కలాం బోధనను ప్రతి పాఠంలో ప్రతిధ్వనింపజేస్తూ స్ఫూర్తిగా ఉపాధ్యాయుడు మౌలాలి నిలిచారని చెప్పారు. ఈసందర్భంగా అవార్డు అందుకున్న ఆయనకి పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సాహిత వేత్తలు, విద్యాప్రేమికులు పాల్గొని అభినందనలు తెలిపారు.

పంది మాంసం పట్టివేత: ముగ్గురిపై కేసు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంది మాంసం పంచుకునేందుకు సిద్ధమవుతున్న ముగ్గురుని దాడిచేసి పట్టుకుని కేసు నమోదుచేసిన సంఘటన సత్తుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి ఎఫ్ఎస్‌వో నరసింహ తెలిపిన వివరాలు ఇలా.. వేంసూరు మండలం ఎర్రగుంటపాడులో రైతు వాసం వెంకటేశ్వరరావుకు చెందిన పొలంలో కొద్దిరోజుల క్రితం పురుగుల మందు పిచికారీ చేశాడు. ఈ క్రమంలో ఓ పంది పురుగు మందు కలిపిన నీటిని సేవించడంతో మృతిచెందగా వాసం రామకృష్ణ, వాసం వెంకటేశ్వరరావు, చిలకా సాయిలు గమనించారు. పక్కనే ఉన్న ఓ పామాయిల్ తోటలో పోగులు వేసుకుని పంచుకుంటున్న సమాచారాన్ని అందుకున్న ఎఫ్ఎస్‌వో నరసింహ సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. సుమారు రెండున్నర కేజీల మాసాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై వైల్డ్‌లైఫ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సత్తుపల్లి అటవీశాఖ కార్యాలయం

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

వైరా అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం తాటిపూడి గ్రామంలో భర్త ఇంటి ఎదుట భార్య నిరసన చేపట్టింది. వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన బండారుపల్లి సురేష్ అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేశాడని భార్య రమణ ఆందోళన చేపట్టింది. స్థానికులు, పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో రమణ నిరసన విరమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురేష్ అనే వ్యక్తి గత ఆరు సంవత్సరాలుగా తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి.. రెండేళ్ల క్రితం దేవాలయంలో పెళ్లి చేసుకొని తనను మానసికంగా వేధిస్తున్నాడని తెలిపింది. పెళ్లి చేసుకున్న తరువాత తన ఇంటికి తీసుకువెళతానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు తీసుకు వెళ్లలేదు. కానీ తల్లాడ మండలం నారాయణపురం గ్రామం ఎరుకుల కాలనీలోని తను నివాసం ఉండే ఇంట్లోనే ఉంచి వారానికి ఒకసారి వచ్చి వెళుతుంటాడని వచ్చినప్పుడు తాగివచ్చి ఇష్టం వచ్చినట్టు అసభ్యకరమైన పదజాలంలో దూషిస్తూ, కొడుతుండేవాడని ఆవేదన వ్యక్తం చేసింది.

పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి

పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ చింతనిప్పు శశిదీప్

సత్తుపల్లిరూరల్/ కల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలు దాటిన ప్రతిపాడి పశువునకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ చింతనిప్పు శశిదీప్ అన్నారు. పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా నిర్వహించే గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని కాకర్లపల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 590 పశువులకు టీకాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి తీగలవలె చొంగరావడం, నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి వల్ల కలిగే నష్టాలతో పాటు పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడంతో రైతుకు ఆర్థిక నష్టం ఉంటాయన్నారు. పాలు తాగే దూడల్లో మరణాలు కూడా సంభవిస్తాయని, ఈ వ్యాధికి సంబంధించి వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు సైతం చనిపోవడం జరుగుతుందన్నారు. దూడల్లో మరణాలను నివారించి, ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఉపయోగపడతాయని, అందుకే ప్రతీ పశువుల యజమాని ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవో ఆర్.కిరణ్‌రెడ్డి, ఎల్ఎస్ఏలు డీ.కరుణాకర్, చైతన్య, వీ.సాధిక, వీఏ లాల్‌బీ, పశువైద్య సిబ్బంది, రైతులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వ్యాధులు సోకుండా ముందస్తు జాగ్రత్త

పశువులకు ఏలాంటి వ్యాధులు సోకుండా ముందస్తు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జేడీఏ డాక్టర్ బోడెపూడి శ్రీనివాస్ రైతులను కోరారు. బుధవారం కల్లూరు మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలో పశువైద్యశాఖ తరుపున ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని జేడీఏ, శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ దేవీలు ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాడి రైతులు పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ వ్యాధి అంటూ వ్యాధని, ఈ వ్యాధి సోకితే కాలి గిట్టలు, నోటిలో పుండ్లు ఏర్పడి మేత తినక నీరసించి పోతాయని, ఈ వ్యాధి ముదిరితే ప్రాణాపాయం కలుగుతుందన్నారు. చూడి పశువులు ఈసకుపోతాయని పాడి పశువుల్లో పాల దిగుబడి పూర్తిగా తగ్గటమే కాకుండా ఆర్థికంగా నష్టం కలుగుతుందని వివరించారు. చికిత్స కంటే నివారణ మేలు అని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, కందుకూరు పశువైద్యాధికారులు మమత, సఫియా, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, వీఎల్‌వో కె.రామకృష్ణ, ఎల్ఎస్ఏ ఆమని, సిబ్బంది నయిమ్, గోపాలమిత్రలు, రైతులు మట్టా రామకృష్ణ, లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొర్లగూడెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీఏ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నీరజదేవి

ఘనంగా పోషణ మాసోత్సవ కార్యక్రమాలు

కల్లూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చిన్నకోరుకొండి, కొర్లగూడెం గ్రామాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చిన్నకోరుకొండి, పేరువంచ సెక్టార్ల పరిధిలో పోషక విలువల గురించి, స్థానికంగా లభించే చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అనుబంధ ఆహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులు పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్లు వెంకటమ్మ, భవాని, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, దమయంతి, రాజేశ్వరి, నాగమణి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చిరస్మరణీయుడు 'చలమాల'

వర్ధంతి సభలో పలువురు వక్తలు

పెనుబల్లి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ప్రాంతంలో ఎర్రజెండా అంటే భయపడే రోజుల్లో పేద ప్రజలకు అండగా నిలిచి భూ సమస్యలపై పోరాటాలు సాగించి నేటి తరానికి చిరస్మరణీయంగా నిలిచిన చలమాల సూర్యనారాయణ వర్ధంతి సభలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం మండల క్రేందంలోని చలమాల సూర్యనారాయణ భవన్‌లో ఆయన 43వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభలో సత్తుపల్లి సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చలమాల పెనుబల్లి మండలంలో పలు గ్రామాల్లో సీపీఎం పార్టీని స్థాపించి పేద ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాసరావు, గాయం తిరుపతిరావు, కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, ఈడా కమలాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు వంగా గిరిజాపతిరావుతో పాటు కవులు, రిటైర్డు ఉపాధ్యాయులు పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, చలమాల సూర్యనారాయణ అభిమానులు పాల్గొన్నారు.



చలమాల సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మళ్లీ ఆ నలుగురే!

(7వ పేజీ తరువాయి)

తెలియనట్టు అక్కడా ఇక్కడా తమదే దందా అన్నట్టు నడిపించేస్తున్నారు. ఓవ్యక్తి మాత్రం బినామీ పేర్లతో సుమారు 5కు పైగా దరఖాస్తులు చేశారని వ్యాపారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

సిండికేట్ల అక్రమ వసూళ్లు..

నగరంలో దీపావళి సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసే వారి వద్ద నుంచి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా ఆ నలుగురు వ్యక్తులు అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో షాపు యజమాని నుంచి సుమారు రూ.26వేల వరకు వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఖమ్మంనగరంలో ప్రతీ ఏడాది ఒక్క ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్‌మైదానంలో మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేవారు. ఈ ఏడాది పెవిలియన్‌గ్రౌండ్‌లో కూడా అనమతివ్వడంతో నలుగురు వ్యక్తుల దందాకు పట్టపగ్గాల్లేకుండా పోయాయని ప్రచారం జరుగుతోంది. సాధారణ వ్యాపారులు నుంచి కూడా దందా పేరుతో వసూలు చేస్తుండడంతో వారి స్థాయికి మించి డబ్బులు తెచ్చి ఇప్పటికే పెట్టుబడి పెట్టామని మొరపెట్టుకుంటున్నా ఇస్తేనే షాపులు నడుస్తాయంటూ సిండికేట్ సభ్యులు కావాలని ప్రచారం చేస్తున్నట్టు సమాచారం. కాగా షాపుల యజమానులు మాత్రం వసూళ్ల దందా విషయాన్ని బయటపెట్టేందుకు నిరాకరిస్తున్నారు. అయితే టపాసుల షాపు ఏర్పాటుకు దరఖాస్తు చేసిన తర్వాత సిండికేట్ దళారులు వసూలు చేస్తున్నారు. వీటినుంచి ఇప్పటికే ఒక్కోషాపునకు రూ.3వేల చొప్పున ఒక శాఖకు ముందుగానే ముట్టజెప్పారని, మరోశాఖకు మంగళవారం రూ.3వేల చొప్పున ఇచ్చినట్టు సమాచారం. కొందరు సిబ్బంది నేరుగా కార్యాలయాల్లోనే నగదు తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే సిండికేట్ దందా చేస్తున్న వారు.. అన్ని ఖర్చులు కలిపి గతేడాది రూ.18వేలు వసూలు చేశారని, కానీ ఈ ఏడాది మాత్రం ఖర్చులు పెరిగాయంటూ రూ.26వేలు డిమాండ్ చేస్తున్నారని కొందరు దరఖాస్తుదారులు వాపోతున్నారు. వీటిల్లో షెడ్ నిర్మాణానికి రూ.20వేలు, మైదానంఅనుమతికోసం రూ.6వేలు అని చెబుతున్నట్టు తెలుస్తోంది.

అక్రమంగా వసూళ్లు చేస్తే కఠిన చర్యలు : ఏడీసీపీ ప్రసాదరావు

బాణసంచా దుకాణాల ముసుగులో డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఏడీసీపీ ప్రసాదరావు హెచ్చరించారు. బుధవారం ఖమ్మం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డ్రా పద్ధతిలో షాపులు కేటాయించగా..ఈ కార్యక్రమంలో ఏడీసీపీ మాట్లాడుతూ.. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ మైదానంలో 86షాపులు, పెవిలియన్ గ్రౌండ్‌లో 42షాపులు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించామన్నారు. ఈమేరకు వ్యాపారులతో మాట్లాడి వారి ఆధ్వర్యంలో డ్రా తీశామన్నారు. ఈడ్రాలో కేటాయించిన షాపుల నెంబర్లను సంబంధిత వ్యాపారులకు వివరించారు. అనుమతిలేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా చట్టపరంగా చర్యలుతీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణ మూర్తి, టుటౌన్ సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): కల్లూరు పట్టణంలో బుధ వారం అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత ఆరు సంవత్సరాల నుంచి మండల పరిధిలో సుమారు 500 నుంచి 600మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అఖిల భారత ధర్మప్రచార సభ జిల్లా అధ్యక్షుడు కాటేపల్లి రజనీకాంత్ తెలిపారు. 41రోజుల పాటుగా నిర్విరామంగా నిర్వహించే దీక్ష చేసే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించటం జరుగుతంది. అయ్యప్పలు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా సహకరిస్తున్న దాతలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు బ్రాంచ్ అధ్యక్షుడు లంక అప్పలనాయుడు, ఆళ్ల నరసింహారావు, మాల్లాది బసవయ్య, ఏనుగు అంజిబాబు, జల్లా మాధవరావు, చింతలపాటి చెన్నారావు పోట్రు కిరణ్ మండల పరిధిలో గల పలు గ్రామాల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త పాషా మృతదేహానికి పీసీసీ సెక్రటరీ నివాళులు

చింతకాని, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో బుధవారం మృతి చెందిన చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన మద్యం వ్యాపారి షేక్ పాషా మృతదేహాన్ని చత్తీస్‌ఘర్ ఉర్దూ అకాడమీ డైరక్టర్, పీసీసీ రాష్ట్ర సెక్రటరీ సత్తార్ అలీ, మండల నాయకులు కన్నెబోయిన గోపి, పెంట్యాల అప్పారావు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొదుమూరు సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.